# ఉషోదయం

ఆరేళ్ళ తర్వాత ఆ వూరు, మళ్ళీ మావూరికి పోతున్నానన్న సంగతి జ్ఞాపకం వచ్చింది. అప్పటి అనుభూతి వర్ణనాతీతమైంది. ఊరెంతో మారిపోయి వుంటుంది. నన్నెవరైనా గుర్తుపట్టగలరో లేరో. పెద్దవాళ్ళంతా వున్నారో లేదో ! నాకూ, వూరికీ ఎలాంటి సంబంధమూ ఇప్పుడు లేకపోయినా మీ స్వగ్రామమేది అని అడిగినప్పుడు మా వూరు గోపాలపురం అని చెప్పకుండా వుండలేను. నిజానికి ఆ వూళ్ళో నాది అన్న వస్తువు కాని, నా అన్న వాళ్ళు కాని ఎవరూ లేరు నాకు. కాని, ప్రతీవ్యక్తి మనస్సూ శరీరంతో పాటే మా వూరు అని చెప్పుకునే వూరు కూడా వుంటుంది. అలానే నాకుకూడా.

జీవితం ఎన్నో అనుభవాలను చెరిగిపోని ముద్రలుగా నామీద అచ్చు గుద్దింది. నేను పెరిగి పెద్దవాణ్ణయినాను. ఇప్పుడు నాది దంద్వ ప్రకృతి. ఆశయాలకూ, ఆచరణకూ మధ్య వైవిధ్యంతో నా మనస్సు వూగిసలాడుతూ వుంటుంది ఎల్లప్పుడూ. రోజు రోజుకూ కొత్త కొత్త సంగతులు, కొత్త కొత్త అనుభవాలు, కొత్త లోకాలు నన్ను ఆశ్చర్యంతో ముంచెత్తుతున్నాయి.

జీవించడం మానేసి జీవితాన్ని గురించి ఆలోచించడం వద్దన్నా అలవాటుగా పరిణమిస్తోంది అనుక్షణమూ. చిన్న

తనంలో యీ మబ్బులూ, యీ ఆకాశమూ, యీ ఎర్రటి సంజ; సాయంకాలం విచ్చుకునే చంద్రకాంత పుష్పాలు అమావాస్యనాడు ఆకాశంలోని నక్షత్రాలు, వాన కురిసి వెలిసి కాసే యెండ. దూరంగా చర్చి గంట, ఫ్యాక్టరీ సైరను ఇవన్నీ నాకు ఏవో సందేశాలు చెప్పేవి గావు. ఇప్పుడు నా మనస్సు నన్ను వేరుచేసి తాను ఆలోచించడం నేర్చుకుంది. అందమైన అమ్మాయి కనబడితే అలా వెంటాడటం, ఏమేమిటో సిగ్గు లేకుండా తనకు తాను చెప్పుకుని మురిసిపోవడం నేర్చుకుంది. ఖరీదైన బట్టల్లో ఇరుక్కోవాలనీ, నవలల్లోని నాయికలను మల్లే ఎవరినైనా (ఎవరైనా) ప్రేమించాలనీ తహతహలాడిపోతూంది. ఎప్పుడేనా నేను తిరగబడి ఇదంతా మంచిది కాదు అని చెప్పదలచుకుంటే కాసేపు మూలిగి మళ్ళీ ఎదురు తిరుగుతుంది. తనని తాను సమర్థించుకుంటుంది.

ఇదంతా ఎందుకు చెప్పవలసి వచ్చిందీ అంటే, నేను పూర్తిగా మారిపోయానని చెప్పడానికే. ఆ వూళ్ళోవాళ్ళు ఇప్పుడు నన్ను చూసి, నా అతిశయాన్ని చూసి ఆశ్చర్యపడవచ్చు. వారాలమీద చదువుకున్నాను, ఎవరెన్ని తిట్టినా, కన్నీరు రెప్పలకింద అప్పళించుకుని తొలగిపోయేవాణ్ణి. అటువంటి నేను నా కాళ్లమీద ఎలాంటి తుపాను వచ్చినా తట్టుకుని నిలబడగలను ఇప్పుడు. నేను మా వూళ్ళోవాళ్ళను తలచుకొని కాసేపు గర్వపడ్డాను. నా అంతచదువు ఆ వూళ్ళో ఎవరికీ ఉండదు. నన్నెలా చూస్తారు? అని నాలో నేను ప్రశ్నించుకున్నప్పుడు నాలో ఒక రకమైన అహంభావం కలిగింది.

ఆయన నెవరో కవి అన్నట్లుగా నాకూ అన్పించింది. నా లోని యీ మార్పులు చూసి. "ఏను మా యమ్మ రొమ్ముడిలోన యింతవాడనైన యప్పుడు, యీ లోక మెల్ల నాలోన యిమిడి యుండు" నని.

నిన్నే మా వూరికి ప్రయాణ మైనాను. కారు రోడ్డు నుంచి పంటకాలువ దాటి రెండు మైళ్లు నడచిపోవాలి. కారు ఆగేచోట పెద్ద మర్రిచెట్టు. చిన్నప్పుడు కరణంగా రింటికి మర్రి ఆకులు కోసుకుపోయి యిచ్చి వారి ఆదరాభిమానాలకు పాకులాడే వాడిని. నేను ఆ వూరి నుంచి వెళ్లిపోయ్యేదాకా వెళ్లిపోవలసి వచ్చిన రోజున కూడా కరణంగారి మూడో పిల్ల నాకంటె పదేళ్లు చిన్నది నన్ను ఒరే అని పిలిచేది. ఆ వూళ్లో అప్పటి నా మనుగడ అలా ఉండేది. ఇవాళ నన్ను నేను, ఇంత అహంభావపూరితంగా వంచించుకోవడానికి నేను మనిన ఆసమాజమే కారణం కావచ్చు.

అయితే, నేను మా వూరికి పోవడానికి కారణం నా గొప్పను చాటుకుని అందరి ఎదుటా బడి విర్రవీగుదామని కాదు, ఇప్పటికీ నా కనిపిస్తుంటుంది. వాళ్లు నన్ను ఆమాత్రమైనా బ్రతకనిచ్చి వుండకపోతే నే నేమయ్యేవాడిని? నేను ఆజన్మాంతమూ వాళ్లకు కృతజ్ఞుడనై వుండవలసిందే.

నా ప్రాణస్నేహితులు ఎంత ఉన్నారని చూదామని. రహస్యాలు చెప్పుకుని, వెనకటి తీయటి అనుభూతులను నెమరు

వేసుకుందామనీ వెళుతున్నాను. వెంకటేశ్వర్లునాకు ఎవరని
చెప్పుకోను? ఒట్టి మిత్రుడేనా? కాదు. వాడు నాకు ప్రాణం
పోసినవాడు. నన్ను మనిషిగా చేసినవాడు. ఇలా జీవించడాని
కాధార భూతుడు.

మా వూరు చాలా మారిపోయింది. పంట కాలువ
మీద వెదురుబద్దల వంతెన నిర్మించారు. ఈ వరకు రెండు
తాటి మొద్దులు వుండేవి. ఊళ్లోకి వెళ్లిన తరువాత ఇంకా
కొన్ని విషయాలు నన్ను ఆకర్షించాయి. పిండిమర ఒకటీ,
చిన్న కాఫీ హోటలూ నన్ను విస్మితుణ్ణి చేశాయి. చిత్రమేమి
టంటే నాకు తెలిసిన ముఖాలు కూడా నన్ను తెలిసికోలేక
పోతున్నాయి. ఎవరో ఆఫీసరు ఏదో పనిమీద వచ్చివుంటా
డనుకుం టున్నారని నాకు నేను చెప్పుకుని కాసేపు ఆనందిం
చాను. ముందు ఎక్కడకు పోవాలి? అని ప్రశ్న పుట్టుకుంది.
ప్రాణమిత్రుడు వెంకటేశ్వర్లు. కరణంగారితో దూరపు చుట్ట
రికమూ. ఎటూ తెగకుండా వేధించాయి సమస్యలు. ఊళ్లోకి
వచ్చినదాకా యిలానే ఆలోచించాను. గోపాల మందిరం
నాదృష్టిన పడగానే నాలోని నిద్రాణమైన అనుభూతుల కోయి
లలు తీయగా కూయసాగినై. నా చిన్నతనమంతా నాకు కన్ను
లకు కట్టినట్లయింది. అయితే, యీ వరకు చాలా పెద్దగుడి,
చాలా ఎత్తుగుడి అనిపించేది యిప్పుడు చిన్న మందిరంగానే
దర్శన మిచ్చింది. దానికి కారణం నాలోని మార్పు, అంటే
పొంగుదల కావచ్చు.

ఒక్కసారి లోపలికి వెళ్ళి దేవుణ్ణి చూద్దామనిపించింది. కాని నా చేతిలో సంచి వుంది. సాయంకాలానికి రావచ్చును అని నాకు నేను చెప్పుకుని అక్కడనుండి కదిలాను. వెంకటేశ్వర్లు వాళ్ళ ఇల్లు ఏ మాత్రమూ మారలేదు. అదే ఎప్పటిలాగానే వెలిసి పోయిన ఎర్రమన్ను పట్టెలు దర్శనమిచ్చాయి. ఇంటిముందు అరుగు నిత్య నూతనంగా అలానే వుంది. తలుపు తట్టి నెట్టి లోపలికి వెళ్ళాను. మధ్యవసారా దాటినా ఎవరూ కన్పించలేదు. నేను వెంకటేశ్వర్లని గురించి ఎన్నెన్నో వూహించాను. కనీసం వాటి తాలూకు ఛాయ లేశమాత్రమూ నా కళ్ళముందు కదలాడ లేదు. కనీసం వెంకటేశ్వర్లుకి వొకరిద్దరు పిల్లలైనా కలిగివుంటారనేదే నా వూహయొక్క సారాంశం.

అలానే శూన్యంలో నిలుచున్నట్లు నిలుచుండిపోయాను. ఎవరిని పిలవాలో ఏమీ తోచలేదు. పురాతనత్వం తాలూకు ఛాయలు బాగా ముసురుకుని వున్నందువల్ల నేను నిలుచున్న మధ్యహాలులో ధారాళంగా గాలి వెల్తురూ కూడా లభించటం లేదు. ఆరేళ్ళ క్రిందట ఎట్లావున్నదో ఇప్పుడూ అంతే — ఎలాంటి మార్పు లేదు. దీని విషయం వెంకటేశ్వర్లు నాతో ఎన్నోమార్లు అన్నాడు ఊడదీయించి మళ్ళీ కట్టించాలని. ఆయా సందర్భాలలో కొన్ని అమూల్యమైన సలహాలు వుచితంగా వాడిమీద పారేశాను నేను.

నేను ఇలాంటి ఆలోచనలో పడి కొట్టుకుంటూ వుండగా వాకిట దగ్గు విన్పించి, దాంతోపాటే ఎవరూ? అన్న కంఠం

కూడా విన్పించింది. సందేహం లేదు. ఈ కంఠం వాడి పెదనాన్నదే! నేను బాగా గుర్తుపట్టగలను. ఒకవిషయం చెప్పటం మరచిపోయాను. వెంకటేశ్వర్లుకు తండ్రి చిన్నప్పుడే గతించడం వలన, పెద్దనాన్నకు వేరెవ్వరూ దిక్కులేక పోవటము వలనా, వాడి ఆలనా పాలనా అంతా ఆయన స్వీకరించాడు. నేను ముందుకు పరకాయించి చూద్దునుగదా ఆ హాలులో ఒక మూల నులకమంచంపై వో జీవి నాకు కన్పించింది. నామనస్సు ఎందుకో క్షణంలో ఆర్ద్రమైంది. సందేహం లేదు. ఆయన వాడి పెద్దనాన్న. ఆయనకు నామీద కూడా ఎంతో అభిమానం. నా వున్నతిని కోరేవారిలో, హృదయపూర్వకంగా వాంఛించే వారిలో, సందేహం లేదు ఆయన వొకడు. ఆయన ఆ మంచం మీద వున్న జీవి వెంకటేశ్వర్ల పెద్దనాన్న. నా కళ్ళు చెమర్చాయి. "ఎవరు నాయనా, ఇటు రా" అని పిలిచాడు. నేను ముందుకు కదిలాను. ఆయన వెంకటేశ్వర్లుకు పెదనాన్న.

నేను దగ్గరకు వెళ్ళినా ఆయన గుర్తుపట్టలేదు. "ఎవరు?" అన్నాడు మళ్ళీ. నా పేరు చెప్పాను. నన్ను తనదగ్గర కూచోమని సైగ చేశాడు. నేను కూచున్నాను. "నేను గుర్తుపట్టలేక పోతున్నాను నాయనా. ఎవరు నువ్వు చెప్పు" అన్నాడు. నేను తెలియచెప్పాను. ఆశ్చర్యకరమైన విషయం. ఆయన ఏడుపు సాగించాడు. నా మనస్సు ఆర్ద్రమైంది. నాకళ్ళు చెమర్చాయి. నేను తట్టుకోలేక పోయినాను. ఆయన పాపం! వెంకటేశ్వర్ల పెదనాన్న!

"వెంకటేశ్వర్లు ఏడీ?" అని అడిగాను. ఆయన ఏడుపును దిగమింగి, "ఇంక రెండు రోజు లుంటావు గదూ - నీకు తెలుస్తుంది. సాయంకాలానికి ఇంటికిరా" అన్నాడు. నాకు మనస్సు అదోలా అయింది. ఏమి టిలా దీనుడైనాడు. వెంకటేశ్వర్లు పెదనాన్న.

ఇంతలో వాళ్ళమ్మ కాబోలు లోపలనుంచి వచ్చింది. ఆమె నన్ను గుర్తు పట్టింది. ఏమో చెప్ప బోయింది. దానికి ఆ ముసలాయన ఆమెను కసిరాడు.

అది నా కలవాటే. ఆమెను ఆయన కసరటం ఇదివరలో చాలామార్లు చూశాను.

ఆమె ముఖం చిన్నబుచ్చుకొని వెళ్ళిపోయింది లోపలకు. ఇక అక్కడ వుండటానికి నా మనసొల్లలేదు. ఏదో అవాంఛనీయమైన సంఘటన వారి జీవితాల మీద నుంచి నడచిపోయి వాళ్ళను నిర్వీర్యులనుగా, నిస్పృహా నిరాసక్త జీవులనుగా మార్చివేసినదని నాకు తెలుస్తూనే వుంది. అందుకు నాకు దిగులైంది. అలానే అక్కడ నుంచి కరణంగారింటికి వెళ్ళాను. అక్కడ నే నూహించినంత మర్యాదను చూసి నేను దిగ్భ్రమ చెందాను. పోగానే కాళ్ళు కడగటానికి నీళ్ళిచ్చి కుశలప్రశ్నలు కావించి, జీవన వైవిధ్యాన్ని గురించి ప్రశ్నలు కురిపించారు. ఆ మర్యాదకే నేను మాట్లాడలేకుండా పోయాను. పైన నన్ను గురించి, నా జీవితాన్ని గురించి అంత ఆసక్తి చూసి నేను మాట్లాడలేక పోయాను. నేను ఫూల్లకి వచ్చినట్లు ఆయనకు

అప్పుడే కబురు తెలిసింది. కట్టె లమ్మిన చోట పూవులమ్మటం అంటారే, ఆశాభావం నాలో కదిలి నాకు హాయనిపించింది.

— వాళ్ళ చిన్నపిల్ల పెద్దదైంది. ఒక్కసారిగా అక్కడకు వచ్చి తొంగి చూసింది. ఆ అమ్మాయిని చూసి నేను ఆశ్చర్య పడ్డాను. భావజుడు ప్రవేశించిన లక్షణాలు ఆ అమ్మాయిలో స్ఫుటంగా కనపడుతున్నాయి. పున్నమినాడు చంద్రుణ్ణి పల్చటి మేఘం కప్పుకున్నట్లు నన్ను చూసిన తర్వాత ఆ అమ్మాయి ముఖాన్ని సిగ్గుతెర ఆక్రమించింది. ఇంతలో ఆ అమ్మాయి లోపలకు వెళ్ళి కాఫీగ్లాసుతో మళ్ళీ రంగంమీద ప్రవేశించింది. దగ్గరగా పెట్టి వయ్యారంగా వెనక్కు నడిచింది. వాళ్ళమ్మ "అంత సిగ్గయితే ఎలాగే" అన్న మాటలకు ఆ అమ్మాయి మరీ సిగ్గుపడి పోయింది. క్షణకాలం వెనుక నేను ఇక్కడ గడిపిన జీవితాన్ని మర్చిపోగలిగాను. వాళ్ళ పనిమనిషి నీళ్లుతోడిందట. స్నానానికి లెమ్మని అభ్యర్థించారు నన్ను. అలా ఆపూట గడిచిపోయింది.

అంత త్వరలో వాళ్ళు అలాంటి నిశ్చయానికి రాగల రన్న సంగతిని నే నేనాడూ వూహించలేదు. ఎందుకంటే వాళ్ళు మనుషులకు విలువ కట్టే పద్ధతిని ఇదివరలో నే నెరుగుదును. బహుశా కాలం నాలో ఇంత మార్పు కలిగించినట్లే వాళ్ళను కూడా మార్చివుండవచ్చును.

మరేం లేదు! ఆ ఇంట్లో మెరిసేటే బంగారు బొమ్మను నేను చేసుకుని వాళ్ళను వుద్ధరించాలట. ఆ మాట వాళ్ళన

లేదు. నేనే ఉద్ధరింపబడా లని వాళ్ళ ఉద్దేశ్యమై యుండవచ్చు. కాని నే నలా అర్థం చేసుకున్నాను.

—ఇక నేం కొత్తల్లుడికి జరగవలసిన మర్యాదలో ఏమాత్రం లోపం లేకుండా నాకు మర్యాద జరిగింది. ఆ అమ్మాయికి మరీ సిగ్గు ఎక్కువయింది. ఈ కొత్త పరిస్థితుల మధ్యను నేను చిక్కుకుని ఉక్కిరి బిక్కిరి అయిపోతున్నాను.

సాయంకాలం వెదురు బద్దల వంతెన వేపు షికారు వెళ్ళాను. తాటిచెట్ల వెనకాల కాలవకి దూరంగా సూర్యాస్తమయం చిన్నతనంలో ఎలా ఉత్తేజపరిచేదో అలానే ఇవాళ కూడా మనస్సు ఎన్నెన్నో ప్రశ్నలతో నింపివేసింది. మళ్ళీ కనుచీకటి పడగా ఆ దారంట నడుస్తుంటే పురాతనత్వం తాలూకు సుఖ దుఃఖానుభూతులు క్రిమ్ముకున్నాయి. ఈ దారంట మా నాన్నమ్మ పెళ్లికూతురిగా వచ్చింది ఈ వూరికి. మళ్ళీ అదుగో కనపడే చింత చెట్టు క్రింద కాలువ వొడ్డున శిథిలమైంది, ఎంత విచిత్రం జీవితం. ఒక జీవితకాలంలో సాధించే దేమిటి?

గోపాల మందిరంలో రాధ ఎదురైంది.

ఆ కళ్ళలో ఆ కాంతి ఏదీ ?

ఆ తృప్తి ఏదీ ?

ఏదీ! లేదు చిలిపితనం.

ఒకరిని నవ్వించి తాను నవ్వే కళ్లు ఎందుకిలా ఏమిటో వెతుక్కుంటున్నాయి.

"మాసిన చీరతో పొగడమాకుల రెమ్మల నీడ...
దీర్ఘనిశ్వాసమ్ములన్ నిగిడ్చెదవు...
...................
ఇంత విసుగేటికి నీయల జవ్వనమ్మునన్."

అని యమునా నది ఒడ్డున రాధా దేవిని రూపకల్పన చేసిన కవి హృదయం మనసులో కదిలింది.

ఎవరి కోసం వెతుక్కుంటున్నావు?

శ్యామసుందరుని కోసమా!

వెనుక రోజుల్లో రాధ కళ్లు పెద్దవా, ఆలయంలోని వేణుగోపాల స్వామి కళ్లు పెద్దవా అని చర్చించుకునే వాళ్ళము నేనూ, వెంకటేశ్వర్లూ ఆలయ మండపంలో కూచుని.

ఆ రాధేనా?

ఈ రాధ!

నన్ను చూసి గతుక్కుమంది. నిలిచిపోయింది.

తరువాత తెలిసింది. నేనొచ్చినట్లు ఆ రోజు ప్రొద్దున్నే తనకు తెలిసిందని.

నేనే పలుకరించాను.

"బాగున్నావా రాధా?"

"ఇలా వున్నాను" సమాధానం.

"విశేషా లేమిటి?"

"బ్రతకటమే ఒక విశేషం."

గతుక్కుమన్నాను.

"వేణుగోపాలస్వామి బావున్నాడా?"

చిరునవ్వు. ఆకాశంలో హరి విల్లు లాగున.

"గొప్పవాడ వైనావటగా?"

"ఎవరన్నారు రాధా దేవీ!"

"మాకేం అవసరం లేదులే. మీరే పంచుకోండి ఆ గొప్ప గొప్ప పేర్లు."

"ఎందుకిలా చిక్కిపోయావు?"

కళ్లలో అసహాయత, చెప్పలేని దిగులు.

"చిన్నప్పుడు బావుండేదానివి."

కళ్లల్లో సంతోషం.

ఆమె కళ్లు – "నిజమా?"

నేను – "నిజం."

"మరి మా ఇంటికోసారి రావూ, పొరపాటు, రారూ! మా అన్నయ్య మధ్యాహ్నం చాలా అనుకున్నాడు." – ఆమె.

"చిలిపితనం పోనిచ్చుకున్నావు కాదు. ఇంకా పెళ్లి కాలే దల్లే వుంది" – నేను.

రాధ కళవళపడింది. అక్కడ నిలుచోలేదో ఏమో అనుకున్నాను. ఆమె కళ్లల్లో నీళ్లు తిరగటాన్ని కంటితో నేను పట్టాను. చాలా భయపడిపోయినాను.

"తమాషాకన్నాను రాధా – ఏమీ అనుకోకు."

మళ్లీ చిరునవ్వు. హమ్మయ్య! అనుకున్నాను.

ఇలా వాకిట్లోనిలబడి మాట్లాడుకోవటం బావుండదని పించింది. రాధతో ఎన్నో సంగతులు మాట్లాడాలని మనసు ప్రబలాటపడింది.

వెంకటేశ్వర్లేమైనాడు? ఎక్కడకు వెళ్లాడు?

ఆమె ముఖం వివర్ణమైంది.

"నేను చెప్ప కూడదు." రాధ వెళ్లిపోయింది.

నాకు మరీ ఆశ్చర్యమైంది.

వేణుగోపాలస్వామి మామూలుగానే వున్నాడు. దేవ గన్నేరు చెట్టు - ఎంత పెద్దదో ఇంకా తెల్లటి పువ్వులు పూస్తున్నది. కృష్ణ తులసి వనంలా పెరిగి కమ్మటి వాసనలు వెదజల్లుతోంది.

మరీ చిన్నప్పుడు తులసి దళాలు కోసుకుపోయి నేనూ, వెంకటేశ్వర్లు రాధ ముందు పోస్తే, మధ్యమధ్య చామంతి పూలతో పెద్ద మాల రచించేది.

అది స్వామివారి మెడలో వేలాడుతుంటే మేము భజనలు చేసే వాళ్ళము. రాధ కళ్లు నవ్వేవి. స్వామి కళ్ళు నవ్వేవి ఎందుకు తాను చెప్పకూడ దన్నది? వెంకటేశ్వర్లను గురించి! ఏమైనా వెంకటేశ్వర్లు!

ఒకప్పుడు వెంకటేశ్వర్లను గురించి రాధ కలలు పండించుకున్నదని నే నెరుగుదును. అందువల్లనే రాధను గూర్చి నేను ఏనాడూ కలలు కనలేదు. ఏడి వెంకటేశ్వర్లు? రాణి)

భోజనం చేసిన తర్వాత రాధ వాళ్ళింటికని బయలుదేరాను. జాగ్రత్త. జాగ్రత్త అని పదే పదే చెప్పారు వాళ్ళు.

నాకు నవ్వొచ్చింది.

రాధ వాళ్ళన్నయ్య ఆప్యాయంగా పలుకరించాడు. మంచం మీద కూచోబెట్టాడు. ఎంత మారిపోయాడు! అప్పుడే ముసలివాడై పోయాడు. ఎందుకిలా మారిపోయాడు?

వెంకటేశ్వర్లును గురించి అడిగాను.

అతడు చిన్న నిట్టూర్పు విడిచి చెప్పాడు.

ఎవతెనో తీసుకొని వెళ్ళిపోయాడట!

ఇది సంభవమా!

నా లోని పునాదులు కదిలినై.

ఎక్కడున్నాడు!?

"ఏమో!" అతడి కంఠంలో అసహ్యం.

వెంకటేశ్వర్లు ఎందుకిలా మారిపోయినాడు. ఎప్పుడైనా ఇలాంటి పని చేస్తాడనీ చేయగలడనీ నే నూహించలేదు ఎప్పుడూ.

"ఆ ముసలాయనే కారణం" - అతడన్నాడు.

"ముసలాయన నేం చేస్తాడు!" ఇది రాధ గొంతు.

"నీ కూతురుందావమ్మా" అతడి మందలింపు

ఆ ముసలాయన నెప్పుడూ నన వెనకేసుకొచ్చేవాడు. నానా తిట్లూ తిట్టేవాడు వాణ్ణి. నువ్వు భ్రష్టుడివై పోతావనే వాడు ఎన్ని సంబంధాలు వచ్చినా ఆయనే కుదర నివ్వలేదు. ఆయ

నను అనే. రాధను చేసుకోమని నేను బ్రతిమలాడాను. ఆయన పడనివ్వ లేదు. వాడి కిష్టమే. వాడెందు కిలా మారిపోయాడో మరి. వాడికి మనసంటూ ఒకటుందనీ, బుద్ధీ జ్ఞానమూ వున్న దనీ వయసుతో పాటే అవి వికసిస్తాయనీ ఆయన తెలిసికో లేక పోయాడు. దానికి శిక్ష ఇప్పు డనుభవిస్తున్నాడు."

నాకు ఆశ్చర్యమైంది.

"తనను కని పెంచి, తన మీదే ఆశలు పెంచుకుని కలలుకన్న అమ్మ వున్నదని మరిచిపోయినాడా-బుద్ధిహీనుడు?"

"నిజమే ఎంత బాధపడ్డాడో నే నెరుగుదును. ఎంత చలించి పోయినాడో నే నెరుగుదును. నగ కాన్నుంచి తప్పించు కుందామన్న తలంపుతో తన కందినది స్వర్గమన్న భ్రాంతితో వెళ్ళిపోయినాడు." అత డన్నాడు.

నాకు అసహ్యమేసింది.

అతడే అన్నాడు. "ముసలాయన ఇప్పుడు చాలా బాధ పడుతున్నాడు. ఆయన అంటాడు. తాను కాస్తా పోయిన తర్వాత వాడెలా అయినా తనకు బాధ వుండేది కాదని. పెంచి పెద్దచేసిన మమకారాన్ని కూడా తెంచి వెళ్ళిపోయాడు, మూర్ఖుడు అని మొత్తుకుంటాడు. ఇంతటి అవినీతి, ఇంతటి కళంకం, తను బ్రతికుండగా తనకు ఆపాదింప బడినదని దుఃఖిస్తున్నాడు.

ముసలాయన మీద నాకు జాలి కలిగింది.

ఆ విషయం అంతటితో ఆగిపోయింది.

నా మనసు చాలా దెబ్బ తిన్నది.

తర్వాత రాధను గురించి అడిగాను.

అతడు విషాదంగా నవ్వాడు.

"రాధను నే నీ జన్మలో పెళ్ళి చెయ్యలేను" అన్నాడు.

"మా కేం ఫరవాలేదులే అన్నయ్యా" ఇది రాధగొంతు.

అతడు మరీ దిగులుగా నవ్వాడు.

"ఈ విచారం నన్ను పట్టి పాలారుస్తున్నది."

"అర్థం లేని విచారం అన్నయ్యా." రాధస్వరంలో కసి.

"రాధకి పదిహేడు వెళ్ళిపోతాయి."

"అన్నయ్యా!" రాధ గొంతులో తీక్ష్ణత.

"జీవితం యాతనా మయంగా వుంది."

"ఎందుకన్నయ్యా అవన్నీ" రాధ స్వరంలో దిగులు.

నేను మరీ విచలితుణ్ణే అయినాను.

ఆ విషయాలన్నీ అతడు నాతో ఏకరువు పెట్టటం రాధకు బొత్తిగా ఇష్టం లేదన్న సంగతి నేను గ్రహించ గలిగాను.

నేను సెలవు తీసుకొని లేచి వచ్చేశాను.

ఇన్నాళ్ళో మళ్ళీ తీగ ప్రక్కన పడుకుని దిగాలుగా నిద్ర పోయాను. కలలో రాధ కళ్ళు దిగాలుగా కన్పించాయి. కల కరగిపోయింది. వాళ్ళమ్మాయి ప్రొద్దున్నే తొంగిచూసి సిగ్గు పడింది.

ఆ రోజున రాధను గురించి ఇంకా కొన్ని వివరాలు తెలుసుకున్నాను. అతడు రాధ వాళ్ళన్నయ్య. అప్పుల్లో మునిగి వున్న ఆస్తి కాస్త పోగొట్టుకున్నాడు. కుటుంబంలో ఆర్థిక, ఆరోగ్య పరిస్థితులు సరిగా లేవు. జీవికకే ఎంతో కష్టపడి పోతున్నాడు.

రేపు నేను వూరెళ్ళిపోవటానికి నిశ్చయించుకున్నాను. వెంకటేశ్వర్లు వాళ్ళింటికి మళ్ళీ వెళ్ళబుద్ధి పుట్టలేదు. సాయంకాలం గోపాల మందిరంలో రాధ మళ్ళీ కనపడ్డది. నన్ను చూసి ముఖం తిప్పేసుకుంది. దిగులూ – విషాదమూ – సిగ్గూ అభిమానమూ – అనుకుంటా.

"రాధా!"

ఆగిపోయింది.

"ఎందుకలా తొలగి పోబోతావు?"

ఏమని సమాధానం చెబుతుంది.

"రేపు నేను వూరెళ్ళి పోతున్నాను."

తల వంకించి "మళ్ళీ కనపడవు కాబోలు" అన్నది.

"ఎందుకు కనపడను పిచ్చిదానా!" అంత చనువుగా మాటాడినందుకు నాలో నాకే ఆశ్చర్యం కలిగింది.

రాధ వెళ్ళిపోయింది.

నేనూ వెళ్ళిపోయినాను.

ఆ తెల్లవారు జామున ప్రయాణం. లేకపోతే బస్సు అందదు. తెల్లవారేసరికి రోడ్డుమీద వుండాలి.

ఆ సాయంకాలం ఆ అమ్మాయి నా కళ్ళలోకి ఆశగా చూసింది. ఆ చూపులో ఎన్నో భావాలు దాగి వున్నాయి.

నా మనసు అదోలా అయింది.

తెల్లవారుజామున లేచాను. చిత్రం! ఆ అమ్మాయి కూడా లేచింది. చీకట్లో కనపడలేదు. లేకపోతే ఆ అమ్మాయి కళ్ళలోని భావాన్ని ఇలా చదవగలిగి వుండే వాడిని.

"మళ్ళీ కొద్ది రోజుల్లోనే కలుసుకుంటాం కదండీ" అని. అనవచ్చు.

వెదురు బద్దల వంతెనమీది కొచ్చేసరికి తూరుపు దిక్కున, రంగు రంగుల రేకలు కనబడ్డాయి. ప్రభాత సమయపు మబ్బులు అటూ ఇటూ పరుగెత్తుతున్నాయి. నాకు సాయంగా వాళ్ళు ఓ మనిషిని పంపించారు. వాడు నా హేండ్ బాగ్ తీసుకుని వెనుక నడుస్తున్నాడు.

నాకనిపించింది. మనిషి తృప్తిగా ఎలా జీవించగలడు. తృప్తిగా ఎలా మరణించగలడు? జీవిత కాలంలో ఇదే నేను చేసిన గొప్ప పని అని ఎలా అనుకోగలడు?

ఆమెను నేను పెండ్లి చేసుకుంటే! సూర్యుడుదయించాడు. తూర్పు దిక్కున రాగ రంజితమైన సుప్రభాతంలో అంతే నాలో కూడా సమస్యల చీకట్లు విడిపోయి ఉషోదయమైంది.